# ఈ వీధిలో.............

ఆ ఇంట్లోకి కొత్తగా అద్దెకు దిగారు ఓ భార్యాభర్త జంట. చూడ ముచ్చటగా వున్నారు. ఇంకా పిల్లలు లేరు. హాయిగా కాపురం చేసు కొంటున్నారు.

భర్త ఉద్యోగనిమిత్తం ఉదయం వెళితే సాయంకాలానికిగాని ఇంటికి రాడు. ఆమె ఈలోపల ఒంటరిగానే వుండాలి పుస్తకాలు ఆమె నేస్తాలు. భర్త వచ్చేటప్పటికి స్నానంచేసి, బాగా ముస్తాబై, జడలో మల్లెలు తురుము కొని స్వాగతం చెబుతుంది ఆ ఇల్లాలు. పడిన శ్రమంతా మరిచిపోయి, ఆమెను కౌగిట్లోకి తీసుకుంటాడు ఆ భర్త.

కానీ—

ఆమె అద్దం ముందు నిలుచుని ముస్తాబవుతుంటే అటూ ఇటూ తిరుగుతూ అదే వీధిలోని ఓ నడి వయస్కుడు సందుల్లోంచి గమనిస్తుండటం ఆమెకు నచ్చలేదు అందులోనూ ఆ వీధిలో రౌడీల గలభా ఎక్కువగా వున్నట్టు తెలిసింది. మరింత భయం పట్టుకుంది ఆమెకు. భర్తతో చెప్పాలనుకున్నది కానీ ఎందుకో సంకోచించింది.

అలా కొన్నాళ్ళు సాగింది.

ఓ రోజు

ఆమె అద్దం ముందు ముస్తాబయ్యేవేళ హఠాత్తుగా ఓ యువకుడు గది లోకి దూరి, తలుపు గడియపెట్టి, కత్తి చూపి బెదిరించాడు అరిస్తే చంపేస్తానని. స్థాణువయింది ఆమె

"చెప్పినట్టు నడుచుకో"మని వత్తిడి చేయసాగాడు ఆగంతకుడు. బాగా తాగినటున్నాడు, తూలుతున్నాడు.

ముచ్చెమటలు పోశాయి ఆమెకు. స్పృహతప్పేలా ఉంది.

ఇంతలో గోడదూకి, లోనికొచ్చిన నడి వయస్కుడు ఆమెను కాపాడాడు.

యువకుడు పారిపోయాడు.

"నీయంత వయసు, నీలాగే ఉన్న నా కూతురు ఇదే గదిలో ఇలాంటి దౌర్జన్యానికి గురై చనిపోయింది. అందుకే ఈ ఇంటికి మీరు అద్దెకు దిగినప్పటి నుండి కంటికి రెప్పలా కాపాడుతున్నానమ్మా!

అతని కళ్ళల్లో తడి.

ఆమె నోట మాటరాలేదు.

